# చిత్రం

నిరంజనాన్ని చిరకాలంగా పీడిస్తోన్న కోరిక ఈనాటికి తీరింది. తన ప్రతి బింబాన్ని చిత్రంలో చూసుకోవాలని అతని తహతహ అయితే ఫోటో తీయించు కోవడం నిరంజనానికి కిష్టంలేని పని. మంచి చిత్రకారుడిచేత తైలవర్ణ చిత్రం గీయించుకోవాలనుకొన్నాడు ఫలితంగా క్రితంరోజు ఒక స్నేహితుడు పరిచయం చేసిన ప్రఖ్యాత చిత్రకారుడి దగ్గర దాదాపు ఒకపూట కూర్చుని అతను తిరగమన్న ట్లా తిరిగి చిత్రం గీయించుకొన్నాడు. రఫ్‌గా గీసిన ఆ చిత్రానికి కొన్ని మెరుగులు దిద్ది ఈరోజు సాయంకాలానికి ఇస్తానని చెప్పాడు చిత్రకారుడు.

అతని ఇంటికి చేరుకుని తలుపుతట్టాడు నిరంజనం తలుపు తెరుచుకొంది. 'రండి మీ చిత్రం చాల బాగవచ్చింది. నా ఈ చేత్తో మంత్రిగారి చిత్రంగీశాను. ప్రఖ్యాత నటి తార చిత్రం వేశాను. తాజ్‌మహల్ గీశాను. తిరుపతి దేవుడి చిత్రం గీశాను' చెబుతూనే కవరులోంచి జాగ్రత్తగా చిత్రంతీసి నిరంజనం చేతికిచ్చాడు చిత్రకారుడు.

ఆశ్చర్యపోయాడు నిరంజనం. క్షణం పాటు అతని దవడ క్రిందికి జారింది.

"ఇది నాదేనా?" చివరికెలాగో నోరు పెగుల్చుకోగలిగాడు నిరంజనం.

"అవును. ముక్కు కొద్దిగా కొసగా దిద్దాను."

"ఈ కళ్ళు. కాళ్ళు. ఈ పాదాలు. పొట్టా ఇవన్నీ నావేనా? అసలీ చిత్రం నాదేనా అంట?" నిరంజనానికి చిర్రెత్తు కొచ్చింది. ఏడుపు వచ్చినంత పనైంది.

"అవునండీ ముమ్మాటికీ మీదే. పాదాలు అందంగావేసి చెప్పులు గీశాను. కళ్ళు అరిదంగా కనబడేలా దిద్దాను. పొట్ట ఎత్తుగా లేకుండా సరిపడవేసి చొక్కాకి గుండీలు తగిలించాను. చూడండి, ఎంత బాగా కుదిరిందో" చిత్రాన్ని మరో యాంగిల్‌లో పెట్టి చూపిస్తున్నాడతను.

"చూడు" నిరంజనం అతని భుజం తడుతూ అన్నాడు.

"నేను ఇక్కడికొచ్చింది నా చిత్రం- అక్షరాలా నా చిత్రం గీయించుకోవాలని. అది ఎంత అసహ్యంగా ఉన్నాసరే. మా అమ్మ నాకిచ్చిన రూపాన్ని చిత్రంలో చూసుకుందామని. నేను చచ్చిపోతే నా భార్యాపిల్లలకి, నా స్నేహితులకి నన్ను గుర్తుంచుకునేలా చేయడానికి నా చిత్రం గీయమన్నాను. అంతేగాని ముక్కు కొసగాదిద్ది. కళ్ళు అందంగా గీసి, పొట్ట కనబడకుండాచేసి చివరికి పాదాలు సైతం అందంగా చిత్రించి చక్కని చిత్రం నా కందిస్తావని కాదు. జీవంలేని చిత్రాన్న యితే మార్చగలిగావుగాని ప్రాణమున్న నన్ను మార్చలేవు కదా? సరే, ఎంతో కష్టపడి ఇవన్నీ చేశావు గనక ఈ చిత్రాన్ని నువ్వే ఉంచుకో. దీనిద్వారా నీ చిత్రకళా నైపుణ్యాన్ని ప్రదర్శించుకో. జనం బహుమతులూ, మెడల్సూ ఇచ్చి సన్మానిస్తారు. నా దృష్టిలో మాత్రం నా చిత్రంగా దానికి వీసమెత్తు విలువలేదు."

ఒక్క అంగలో బయటకొచ్చాడు నిరంజనం.

—దమయంతి.